*'ఈనాడు ఆదివారం' (26.10.2008)*

# నిన్ను నిన్నుగా ప్రేమించుటకు...

**– ఆకునూరి మురళీకృష్ణ**

" అమ్మా... నువ్వూ నాన్నా ఎప్పుడూ పోట్లాడుకోలేదా ? " ఇంటర్‌నెట్ ఛాటింగ్‌లో సుజిత అడిగిన ప్రశ్న చూసి ఒక్క క్షణం ఆలోచిస్తూ వుండిపోయాను. సుజిత మళ్ళీ తన భర్తతో పోట్లాడిందని అర్థమైంది నాకు ఆ మెసేజ్ చదవగానే.

అందరు అమ్మాయిల్లా తమ దాంపత్యంలోని అన్ని రహస్యాలనీ నాతో పంచేసుకోదు సుజిత. ఎంతవరకూ అవసరమో అంతవరకే చెబుతుంది. అది దాని వ్యక్తిత్వం. కానీ ఈ మధ్య దాని ధోరణిని బట్టి చూస్తుంటే తరచుగా తన భర్త కార్తీక్‌తో పోట్లాడుతోందని తెలుస్తోంది. చిన్న చిన్న విషయాల్లో పంతాలకిపోయి జీవితాన్ని కలతల మయం చేసుకుంటున్న ఈ తరం యువత ధోరణి గుర్తొచ్చి బాధ వేసింది. సుజిత కూడా అదే కోవలోకి చేరబోతోందా ? ఖండాంతరాలలో వున్న కూతురి కాపురం గురించిన బెంగతో ఒక్క క్షణం నా మనసు బరువెక్కింది. మరుక్షణమే గుండె దిటవు చేసుకున్నాను. అదేమీ చిన్నపిల్ల కాదు...

" ఎందుకు పోట్లాడుకోలేదు ? చాలాసార్లు పోట్లాడుకున్నాం, ఇప్పటికీ కుంటూనే వున్నాం. అసలీ ప్రపంచంలో నేనిప్పటిదాకా ఎక్కువసార్లు పోట్లాడినది మీ నాన్నతోనే " అని టైప్ చేసాను. సమస్యని గుర్తించగానే మనం చేయాల్సిన ప్రథమ చికిత్సలాంటి పని సాధ్యమైనంతవరకూ సమస్యని తేలికచేసి చూపటం. నేను అదే చేసాను.

నా సమాధానానికి సుజిత నవ్వుతోందన్నదానికి సూచనగా ఛాటింగ్ బాక్స్‌లో నాకు నవ్వుతున్న చిన్న కార్టూన్ బొమ్మ ముఖం మెసేజ్ పంపించింది. అది చూడగానే నా మనసు కొంత తేలికపడింది.

" మరి మాకెప్పుడూ అలా కనిపించేవారు కాదు మీరిద్దరూ... ఎంతో అన్యోన్యంగా వుండేవారు. మన బంధువులందరూ కూడా ఈ విషయంలో మీకు కితాబులివ్వడం నాకు తెలుసు " అంది సుజిత.

" బావుంది... పోట్లాడుకోవడమంటే అందరికీ తెలిసేలా పోట్లాడుకుంటామా ? భార్యాభర్తల మధ్య పోట్లాటంటే ఫ్యాక్షన్ సినిమాలో యుద్ధంలా వుండదు... మాటల స్థానంలో మౌనం... చిరునవ్వుల స్థానంలో చూపుల చురకత్తులు... ఒకరితో ఒకరు డైరెక్ట్‌గా మాట్లాడుకోగలిగిన విషయాలకి కూడా పిల్లల మీద ఆధారపడడాలు... ఇలా వుంటుంది. ఒకొక్క సందర్భంలో పోట్లాడడం కన్నా నేను ఆయనతో పోట్లాడుతున్నానన్న సంగతి ఆయనకి తెలియచేయడానికి చాలా కష్టపడాల్సి వచ్చేది... "

మెసేజ్ టైప్ చేస్తున్నాను కానీ, నాకు తెలుసు... ఈ కాలం మొగుడూ పెళ్ళాల పోట్లాటలు అంత సున్నితంగా వుండవని. మా రోజుల్లో అయితే ఇంట్లో అత్త మామలూ, ఇంటినిండా జనం... ఎప్పుడో తప్ప దొరకని ఏకాంతం- ఎప్పుడూ ఎరుగని స్వేచ్ఛ, స్వతంత్ర్య భావాలు !

ఇప్పుడలా కాదు కదా ? కోరుకోగానే దొరికే ఏకాంతం... కావలసినంత స్వేచ్ఛ... మనసులో వున్న దాన్ని కుండ బద్దలు కొట్టినట్లు ఎదుటి వాళ్ళ ముఖం మీదే చెప్పెయ్యగల ధైర్యంతో కూడిన మనస్తత్వం... అసలివన్నీ కలిసే ఈ కాలం పిల్లలని పాడు చేస్తున్నాయా అనిపిస్తోంది. అలాంటి వాళ్ళని నా సున్నితమైన భావాలు కదిలిస్తాయా అన్నది అనుమానమే... కానీ ముందే అనుకున్నట్లుగా సమస్యని తేలిక చేయడం మాత్రమే నా ఉద్దేశం. అందుకే అదే మెసేజ్‌ని టైప్ చేసి ' సెండ్ ' అని వున్న చోట క్లిక్ చేసాను.

ఊహించినట్లుగానే నేను పంపిన మెసేజ్ పూర్తిగా చదవకుండానే గోడకొట్టిన బంతిలా మరో ప్రశ్న దూసుకు వచ్చింది సుజిత దగ్గరనుంచి.

" మరి మీరు ఆ పోట్లాటలనెలా పరిష్కరించుకునే వారు ? నువ్వు రాజీ పడిపోయేదానివా ? "

ఈ సారి సుజిత ప్రశ్నకి సమాధానం చెప్పడానికి నేను కొంచెం ఆలోచించాల్సి వచ్చింది. అసలు నాకు మా ఆయనతో జరిగిన తగాదాలే గుర్తున్నాయికానీ వాటి పూర్వాపరాలూ, అవెందుకు వచ్చాయో కారణాలూ గుర్తుకులేవు. ఇంక వాటిని మేమెలా పరిష్కరించుకున్నామో అసలు గుర్తులేదు. ఒకసారి మా అత్తగారి తమ్ముడినేదో అన్నానని నాతో వారం రోజులు మాట్లాడలేదాయన. నేనన్నదానిలో తప్పేంలేదనీ, ఆయనే గుమ్మడికాయల దొంగంటే భుజాలు తడుముకుంటున్నారనీ నా వాదన. నా మటుకు నేను నా తప్పేంలేదనుకోవడం వల్ల ఆయన

దిగివచ్చినా యుద్ధాన్ని మరో వారం రోజులు పొడిగించాను నేను. ఆ విషయం బాగా గుర్తుంది నాకు. అదికూడా చివరికెలా పరిష్కారమైందో గుర్తులేదు.

అలాంటి తగాదాలన్నింటినీ చాలా మటుకు మర్చిపోయేవాళ్ళం. లేదా మరేదో అంతకన్నా పెద్ద సమస్య రావడంవల్ల దాన్ని తాత్కాలికంగా పక్కన పెట్టేసే వాళ్ళం. ఒక్కోసారి మేమిద్దరం ఒకరితో ఒకరు మాట్లాడుకోవడంలేదన్న సంగతి మరిచిపోయి ఏదో ఆవేశంలో మాట్లాడేసే వాళ్ళం. తర్వాత నవ్వుకుని కలిసిపోయే వాళ్ళం. అదంతా గుర్తుకు వచ్చి నా ముఖం మీద చిరునవ్వులు విరిసాయి. నేను ఆ ఆలోచనల్లో వుండగానే మెసేజ్ వచ్చింది సుజిత దగ్గరనుంచి.

" చెప్పమ్మా ? ఎలా పరిష్కరించుకునేదానివి వాటినన్నిటినీ ? రాజీ పడిపోయేదానివా ? " ఈ సారి ఇంగ్లీష్‌లో అడుగుతోంది. అంటే సీరియస్‌గా వుందని అర్థమైంది నాకు. వెనువెంటనే ఆలస్యాన్ని భరించలేనట్లుగా 'బజ్' అన్న మెసేజ్‌తో నా మెసేజ్ బాక్స్‌ని కుదిపింది స్క్రీన్ మీద.

నవ్వుతున్న కార్టూన్ బొమ్మ ముఖాన్ని ముందుగా పంపి తర్వాత మెసేజ్ టైప్ చేసాను.

" చాలా తగాదాలాని నేను మర్చిపోవడం ద్వారా... "

" నీకు నవ్వెలా వస్తోంది ? మర్చిపోవడమంటే రాజీ పడిపోవడమే కదా ? ఎందుకు సర్దుకుపోవడం ? రాజీ పడిపోవడం ? నువ్వు నాన్న మీద ఆధారపడి వున్నావనేనా ? "

సుజిత ప్రశ్నకి నాకు ఆశ్చర్యం వేసింది. నేను నిజంగానే అన్నింటికీ ఆయన మీద ఆధారపడి జీవిస్తున్నా ఈనాటివరకూ ఆ విషయం నాకెప్పుడూ స్ఫురణకి రాలేదు. నాకు ఆర్థికపరమైన ఆదాయం లేదు. ఆయనమీదే ఆధారపడి జీవిస్తున్నాను. నిజమే... కానీ కొన్ని విషయాల్లో నేను రాజీ పడిపోయినా అందుకు కారణం నేను ఆయన మీద ఆధారపడి జీవించడం కాదు... ఒకవేళ అలా ఆధారపడకపోయినా కూడా మా దాంపత్య జీవితం ఇలాగే వుండేదని ఖచ్చితంగా చెప్పగలను.

విచిత్రమేమిటంటే... మొగుడి మీద ఆధారపడి జీవించినా ' ఆధారపడటం ' అన్నది ఆనాడు మమ్మల్ని బాధించలేదు. మొగుడి మీద ఆధారపడకపోయినా ' ఆధారపడటం ' అన్న అంశం ఈతరం ఆడపిల్లలని బాధిస్తోంది... 'మేము మీ మీద ఆధారపడి లేము' అన్న విషయం అనుక్షణం భర్తకి చెప్పాలని ప్రయత్నిస్తారు, దానిని భర్త గుర్తించకపోతే బాధ !

నాకు నవ్వొచ్చింది.

" నిజమే... నువ్వన్నట్లుగా నేను రాజీ పడ్డాననే  అనుకో... కానీ ఆ రాజీపడడం అభద్రతా భావంతో కాదనీ మా మధ్య బంధాన్ని నిలుపుకోవాలనే ఆరాటంతోననీ ఎందుకు అనుకోకూడదు ? "

వెంటనే బాణంలా వచ్చింది మెసేజ్ సుజిత దగ్గరనుంచి.

" దానినే ఇంగ్లీషులో హిపోక్రసీ అంటారు మమ్మీ..."

అంత వేగంగా టైపు చేయడం ఎలా నేర్చుకుందో నాకిప్పటికీ ఆశ్చర్యమే... ఆ సమాధానం ముల్లులా గుచ్చుకుంది నా మనసులో. నేను తేరుకునే లోపులే మరో మెసేజ్ వచ్చింది.

" నిరంతరం గొడవ పడుతూ... ప్రతిసారీ  రాజీ పడుతూ విడిపోలేని బలహీనత వల్ల కలిసి వుంటూ 'బంధాన్ని నిలుపుకుంటున్నాం' అని సంతోషపడడం హిపోక్రసీ కాక మరేమిటమ్మా ? "

ఈసారి దాని ధోరణికి నాకు కోపం వచ్చింది.

" అయినా నిరంతరం కొట్టుకునే నేనూ మీ నాన్నా బాగానే వున్నాం. మధ్య నీకెందుకు బాధ ?  "  అని మెసేజ్ ఇచ్చాను.

నేనలా అడిగేసరికి సుజిత సూటిగా విషయానికొచ్చేసింది.

" ఈమధ్య నాకూ కార్తీక్‌కీ సరిగా పడటం లేదమ్మా... కానీ నీలా నేనీ విషయాన్ని తేలికగా తీసుకోలేకపోతున్నాను. ఏ విషయంలోనూ మా ఇద్దరి అభిప్రాయాలూ కలవవు. ప్రతిచిన్న విషయంలోనూ మాకు అభిప్రాయబేధాలే... ఇలా ఎంతకాలం కలిసి వుండగలం అనిపిస్తోంది. పెళ్ళి కనుక ఇంతలా ఆలోచించాల్సి వస్తోంది... అదే ఏ బిజినెస్ పార్ట్నర్స్‌మో అయితే హాయిగా ఎప్పుడో విడిపోయేవాళ్ళం..."

చివరి వాక్యాలు చదివిన నాకు బుర్ర తిరిగిపోయింది. పెద్ద చదువులు చదివి, ఆకాశం అంత ఎత్తుకు ఎగిరి, విదేశాల్లో తిరుగుతూ చివరికి నా కూతురు నేర్చుకున్నదిదా ? అన్న బాధ...

" స్త్రీ పురుషులిద్దరూ రెండు విభిన్న వర్గాలకి చెందిన వారు. వాళ్ళ ఆలోచనలెప్పుడూ ఒకేలా వుండవు. వాళ్ళిద్దరికీ ముడి పెట్టి ఒక గూట్లో వుండమని చెబుతుంది మన వివాహ వ్యవస్థ. మౌలికంగానే ఇద్దరూ ఆలోచించే పద్ధతులు వేరు కనుక వారి మధ్య అభిప్రాయ భేదాలు రావడం సహజం..."

కంప్యూటర్స్‌తో పాటూ సైకాలజీలో కూడా ఎన్నో డిగ్రీలు చేసిన నా కూతురికి నేనిదంతా చెప్పాల్సిన అవసరం లేదని నాకు తెలుసు. అందుకే మరేం మాట్లాడకుండా కంప్యూటర్ స్క్రీన్ వంక బ్లాంక్‌గా చూస్తూ కూర్చుండిపోయాను. ఈలోగా సుజిత దగ్గరనుంచే మరో మెసేజ్ వచ్చింది.

" మీ రోజుల్లో అయితే మీకు సంసారం తప్ప వేరే ఆశలూ ఆశయాలూ ఏమీ వుండేవి కావు కనుక అలాంటివన్నీ భరించి సర్దుకుపోతూ జీవించే వాళ్ళు. ఇప్పుడు తల్చుకుంటే ఆ పోట్లాటలన్నీ చిలిపి తగాదాల్లాగానూ, తీపి జ్ఞాపకాల్లానూ అనిపించచ్చు. కానీ నా విషయం వేరు మమ్మీ... సంసారమొక్కటే జీవితం కాదు నాకు. నాకంటూ ప్రత్యేకంగా ఒక ప్రపంచం వుంది. కొన్ని ఆశయాలూ నా జీవితం ఎలా గడవాలో అన్న నిర్ధిష్టమైన ఆలోచనలూ నాకున్నాయి. సంసారమూ ముఖ్యమే కానీ ప్రైమరీ కాదు. అది మాకు సెకెండరీ మాత్రమే. నా జీవితం నాకిష్టమైన రీతిలో గడిచి నేనకున్న గోల్‌ని చేరుకోవాలంటే ఇలాంటి చికాకులన్నీ లేకుండా దాంపత్య జీవితం ఎంత సాఫీగా సాగిపోతే అంత మంచిది... నాకే కాదు... కార్తీక్‌కి కూడా ! అందుకే ఇలా జీవించడం విసుగొస్తోంది మమ్మీ... "

ఆవేశంలో చెప్పినా నిజమే చెప్పింది. దానికే కాదు... దానిలాంటి ఈతరం కెరీర్ ఓరియెంటెడ్ పిల్లలందరికీ సంసారం అన్నది ప్రైమరీ కాదు సెకెండరీ మాత్రమే... దాని మాటలు చూస్తుంటే ఆవేశంలో అదేలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని భయం వేసింది. అసలు నన్ను మెంటల్‌గా ప్రిపేర్ చేయడానికే ఇదంతా చెబుతోందా అని అనుమానం వచ్చి మెదడంతా బ్లాంక్‌గా అయిపోయింది.

మేళతాళాలతో వేద మంత్రాల మధ్య మేము కార్తీక్‌కి కన్యాదానం చేసి కళ్ళనీళ్ళు పెట్టుకోవడం గుర్తుకు వచ్చింది. పసుపు బట్టల్లో వున్న దంపతులని పిల్లా పాపలతో కలకాలం

చల్లగా వుండమని దీవించిన పెద్దల దీవెనలు గుర్తుకు వచ్చాయి. ఒక్కసారిగా  గుండెనెవరో చేత్తో పట్టుకుని పిండినట్టనిపించింది.

" తొందరపడి ఏ నిర్ణయమూ తీసుకోకు సుజీ... జీవితం అంటే గోల్సూ ఎచీవ్‌మెంట్సూ డబ్బు సంపాదించడం మాత్రమే కాదు ! " తడబడుతున్న చేతులతో మెసేజ్ టైప్ చేసి పంపాను.

" జీవితం అంటే నిరంతరం కొట్టుకుంటూ మనశ్శాంతిలేకుండా ఒకే కప్పుక్రింద కలిసి బ్రతుకుతూ బయటి వాళ్ళకి నవ్వుతూ కనబడడం కూడా కాదు కదమ్మా ? "  అంతే వేగంగా దాని దగ్గరనుంచి సమాధానం వచ్చింది.

" నువ్వు గోరంతని కొండత చేసి చూస్తున్నావు సుజీ... సంసారమన్నాక గొడవలు రావడం సహజం... అసలు అభిప్రాయబేధాలే రాని భార్యా భర్తలంటూ ఎవరూ  వుండరు... "

" నువ్వీ మాటంటావని నాకు తెలుసు... తరతరాలుగా మనం నేర్చుకున్న ఆలోచనా విధానం అది. దానికి భిన్నంగా ఆలోచించాలంటే మనకి భయం ! ఒక్క క్షణం కూడా పడకుండా జీవితాంతం కలిసున్న మెగుడూ పెళ్ళాలని నేనూ చాలా మందిని చూసాను, మన కుటుంబంలోనే. అంతెందుకు ? నువ్వే అన్నావు... ఇప్పటికీ నాన్నతో నిరంతరం తగాదా పడతావని.  అమ్మమ్మ నీకు చెప్పిన నీతులనే నాకూ చెబితే వినలేను... తార్కికంగా ఆలోచించి ఒక్క కారణం చెప్పు ? జీవితాన్ని చక్కదిద్దుకోలేని చేతకానితనం కాకపోతే ఈ తగాదాల వల్ల సాధించేదేమిటి ? అలా నిరంతరం కొట్టుకుంటూ కలిసుండడం వల్ల ఒరిగేదేమిటి ? "

దాని మాటలు చూస్తుంటే కార్తీక్‌కీ దానికీ ఏదో పెద్ద పోట్లాటే జరిగిందని అర్ధమౌతోంది నాకు. కానీ ఎంత పెద్ద పోట్లాటైనా భార్యా భర్తల మధ్య చాలా చిన్నదే. ఆవిషయం సుజితకెలా చెప్పాలో అర్ధం కావడం లేదు. ఈలోగా బిజీగా వున్నానంటూ సుజిత ' ఆఫ్ లైన్లోకి ' వెళ్ళిపోయింది. అన్యమనస్కంగానే కంప్యూటర్ ముందునుంచి లేచాను నేను.

అప్పుడు ఖండించాను కానీ ' జీవితాన్ని చక్కదిద్దుకోలేని చేతకానితనం కాకపోతే ' అన్న సుజిత మాటలు తర్వాత నన్ను ఆలోచనల్లో పడేసాయి. నిజం చెప్పాలంటే ఆయనతో తగాదా పడినప్పుడల్లా దానంత కాకపోయినా ఆరోజుల్లో నేనూ ఎంతో కొంత ఆవేశపడినదాన్నే. 'ఈదేసిన గోదావరీ, దాటేసిన కష్టాలూ తియ్యగా వుంటాయని' ముళ్ళపూడి వెంకటరమణ గారు ఎక్కడో అన్నట్లుగా  ఇప్పుడు తలుచుకుంటే ఆయనతో పడ్డ తగాదాలన్నీ తీయగా అనిపిస్తున్నాయా

నాకు ? నిజంగా చేతకానితనంతోనే ఇన్నాళ్ళూ నేనూ ఆయనా కలిసున్నామా ? సుజిత చెప్పినట్లు ఆత్మవంచన చేసుకుంటూ బ్రతుకుతున్నానా ?

కాదు...కాదని నాకు చాలా గట్టిగా అనిపిస్తోంది. మరి సుజిత అడిగినట్లుగా ఆ తగాదాల వల్ల మేము సాధించినదేమిటి ? సమాధానం తెలిసీ తెలియనట్లుగా వుంది.

****

డైనింగ్ టేబిల్ మీద కూర గిన్నె మూత తీస్తూనే కోపంగా అన్నారాయన " ఇవాళ కూడా క్యారెట్ కూరేనా ? నీకీ క్యారెట్ కూర తప్ప ఇంకేం చేయడం నేర్పలేదా మీ అమ్మ ? "

" మరేం పర్వాలేదు... క్యారెట్ వంటికి మంచిది. రోజూ తింటే బీపీ తగ్గుతుంది. చీటికీ మాటికీ ఇలా అరవడం కూడా తగ్గుతుంది " మంచినీళ్ళు గ్లాసుల్లో పోస్తూ రిటార్టిచ్చాను నవ్వుతూనే.

" ఆరోగ్య సూత్రాలెందుకు చెబుతావు ? క్యారెట్ నీకిష్టమని చెప్పచ్చుకదా ? " అన్నారాయన కయ్యానికి కాలు దువ్వుతూ.

నేను మాత్రమేమైనా తక్కువ తిన్నానా ? " నన్ననడం ఎందుకు ? మీకిష్టమైన కూరగాయలు మీరే తెచ్చుకోవచ్చుగా వండి పడెయ్యడానికి నేనెలాగూ వున్నాను. అది మాత్రం చెయ్యరు... బద్ధకం ! " అన్నాను.

" తేవచ్చు... కానీ నువ్వు చాలా తెలివైనదానివి. నోటితో నో అని చెప్పవు. నేను తెచ్చిన కూరలు నీకిష్టం లేకపోతే వారం రోజులు ఫ్రిజ్‌లో మురగబెట్టి ఎనిమిదో రోజున పాడైపోయాయని బయట పాడేస్తావు... నీ సంగతి నాకు తెలియదా ? " అన్నారాయన పోట్లాటని పెంచుతూ.

ఆయన మాటలకి నాకు కోపం రావడం లేదు. ఎందుకంటే అదంతా ఆయన కావాలనే చేస్తున్నారని నాకు తెలుసు... మళ్ళీ సాయంత్రం బాల్కనీలో కూర్చుని వేరే విషయాలు మాట్లాడుకుంటున్నపుడు " మధ్యాహ్నం చేసిన క్యారెట్ కూర బాగుందోయ్ " అంటూ ఏదో చెబుతారు. పిల్లలిద్దరూ చెరో దేశమూ వెళ్ళిపోయాక ఇంట్లో ఇద్దరమూ ఒంటరిగా వుండడం చాలా బోర్ కొడుతోంది. అందుకే ఇలాంటిదేదో విషయాన్ని తీసుకుని నాతో వాదులాటకి దిగుతూ

కాలక్షేపం చేస్తుంటారాయన. ఎప్పుడూ లేనిది రిటైరయ్యాక ప్రతి చిన్న విషయానికీ నన్ను విమర్శిస్తుంటే మొదట్లో నాకు కోపం వాచ్చేది. కానీ అసలు విషయం అర్థమయ్యాక కోపం రావడం మానేసింది. ఆయనతో సమంగా నేనూ వాదిస్తున్నాను.

ఆయన మాటలు వింటూ నవ్వుకోబోతున్న నేను ఒక్కసారిగా ఏదో తట్టినట్లుగా ఆగిపోయాను. మరుక్షణం నా ముఖం మతాబులా వెలిగిపోయింది... అవును... సుజిత అడిగిన ప్రశ్నకిపుడు నాకు సమాధానం దొరికింది !

" మీరు పెట్టుకుని తింటూ వుండండి... నేనిప్పుడే వస్తాను " అంటూ కంప్యూటర్ దగ్గరకి పరిగెత్తాను. సుజిత ఆన్ లైన్లో లేదు. అయినా సరే మెసేజ్ టైప్ చేసాను.

" సుజితా... ఈ కొట్లాటల వల్ల మీరు సాధించినదేమిటి అని అడిగావుకదా ? ఆలోచించగా ఆలోచించగా నాకిప్పుడు తెలుస్తోంది... మిగతావారి సంగతి నాకు తెలియదు కానీ నా మటుకు నాకు దాంపత్య జీవితంలో మా మధ్య వచ్చిన ప్రతి చిన్న తగాదా మాకు ఒకరి మీద ఒకరికి మరింత అవగాహనని పెంచిందనిపిస్తోంది ! అవన్నీ మేమిద్దరం ఒకరినొకరం అర్థం చేసుకోవడానికి మరింత దోహదం చేసాయనిపిస్తోంది ! ! ఇప్పటికీ అలా అర్థం చేసుకుంటూనే వున్నాము... అందుకే ఇదంతా నాకు చేతకానితనంగా అనిపించడం లేదు. మీ మధ్య వచ్చే తగాదాలని కూడా ఆ దృష్టితో చూస్తే నీకవన్నీ ' చికాకుల్లా ' కనిపించవేమో... ఆలోచించు ?

మీకు సంసారమే జీవితం కాకపోవచ్చు... ఇద్దరికీ జీవితంలో విడివిడిగా ఆశలూ ఆశయాలు వుండొచ్చు... కానీ సంసారం అంటే రెండు విడి విడి జీవితాలు ఎంతమాత్రం కాదు... రెండు జీవితాలు కలగలిసి ఒకటిగా పెనవేసుకు పోవడం. అది తెలుసుకోవాలి మీరిద్దరూ. ప్రేమించబడాలని ప్రతి మనిషికీ వుంటుంది. మచ్చలేని ప్రేమని జీవిత భాగస్వామినుంచి ప్రతివారూ కోరుకుంటారు. కానీ అలా ప్రేమించబడాలంటే ముందు మనం ప్రేమించాలనీ, అందుకు ఎదుటి మనిషిని అర్థం చేసుకోవాలనీ తెలుసుకోరు !

నేను చెప్పానని నువ్వు నీ నిర్ణయం మార్చుకోవని నాకు తెలుసు. కానీ జీవితంలోనైనా బిజినెస్‌లో నైనా 'అర్థం చేసుకోవడం' అన్నది చేతకానితనం కాదని నువ్వు తెలుసుకోవాలని చెబుతున్నాను... "

మెసేజ్‌ని సుజిత ఈ మెయిల్ ఐ.డీకి మెయిల్ చేసి తీరికగా ఆయనతో దెబ్బలాడడానికి డైనింగ్ హాల్లోకి వచ్చాను.

నా మెసేజ్ చదివాక సుజిత ఏ నిర్ణయం తీసుకుంటుందా అన్న భయం నాకు లేదు... దాని తెలివితేటల మీద నాకు నమ్మకం వుంది !

*


రచయిత పేరు : ఆకునూరి మురళీకృష్ణ

చిరునామా : A.Murali Krishna
Flat No.907, Nagarjuna Apartments
Venkata Ramana Colony Main Road
Ashok Nagar
KURNOOL

**Phone : 98481 74957, 93955 87974**

E-mail : akunuri_murali@yahoo.co.in